
ప్రతి బొట్టు భూమిలోకి వెళ్లాలి

- వర్షపు నీరు భూమిలో ఇంకేలా చర్యలు
- ఇంకుడు గుంతలకు సై అంటున్న కాలనీ, బస్తీ వాసులు
- జలమండలి పర్యావేక్షణలో జోరుగా నిర్మాణాలు

వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నా భూగర్భ జలాలు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. నీరు ఇంకేందుకు స్థలం లేక వరద నీరు వృథాగా పోతోంది. దీనికి ఇంకుడు గుంతలు ఎంతో దోహదం చేస్తాయని ప్రభుత్వం, జలమండలి అధికారులు చెబుతున్నారు. ఈమేరకు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ జలమండలి అధికారులు ఇంకుడు గుంతల ఏర్పాటుకు నడుం బిగించారు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12 ఎన్‌బీటీనగర్‌లో నమూనా ఇంకుడు గుంతను ఏర్పాటు చేసి నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీతో ప్రారంభించారు.

- బంజారాహిల్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి)



ఇంకుడు గుంత ఏర్పాటు చేయాల్సిందే!

భావి తరాలకు భూగర్భ జలాలు అడుగంటి పోకుండా ఉండేందుకు జలమండలి చేస్తున్న ప్రయత్నంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరుతున్నారు. ముఖ్యంగా కొత్తగా ఏర్పడుతున్న కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలపై దృష్టి సారించారు. కొత్తగా నల్లా కనెక్షన్ కావాలంటే మీ కాలనీలో తప్పని సరిగా ఏదో ఒక ప్రాంతంలో ఇంకుడు గుంతను తవ్వించాల్సిందేనని సూచిస్తున్నారు. ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడంవల్ల ఆయా ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీరంతా అందులోకి చేరడంవల్ల భవిష్యత్తులో మీరు ఉంటున్న చోట నీటి జలాలు పుష్కలంగా ఉంటాయని చెబుతున్నారు. పార్కులు, క్రీడా మైదానాల్లో కూడా ఏర్పాటు చేసుకోవచ్చంటున్నారు. ముఖ్యంగా విద్యాసంస్థలు నడుపుతున్న వారు కూడా ఆయా ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు నిర్మిస్తే నీరు అంతా భూమిలోకి ఇంకుతుందని, దీనివల్ల పరిసర ప్రాంతాల్లో నీటి లభ్యత ఎక్కువగా ఉంటుందంటున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ తట్టికానా పరిధిలో అనేక కాలనీలు, బస్తీలున్నాయి. ఎమ్మెల్యే కాలనీ, గౌరీశంకర్‌కాలనీ, ఎన్‌బీటీనగర్, ఫిలింనగర్ బస్తీలు, జూబ్లీహిల్స్‌లోని అన్ని కాలనీల్లో కమ్యూనిటీహాల్స్ తో పాటు ప్రైవేట్ స్కూల్స్ ప్రాంగణాల్లో ఎత్తు పల్లాలను చూసుకోని ఇంకుడు గుంతలను తవ్వించాలని జలమండలి అధికారులు భావిస్తున్నారు.

స్వచ్ఛందంగా ముందుకు...

నీటి అవశ్యకతను గుర్తించిన అనేక కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు ఇంకుడు గుంతలు తవ్వించేందుకు ముందుకు వస్తున్నారు. తమ సొంత డబ్బుతో నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొన్ని కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు బోరింగ్ ఉన్న ప్రాంతంలో వరద నీరు భూమిలో ఇంకేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. వీటి నిర్మాణం వల్ల వేసవిలో బోరింగ్ ఎండిపోకుండా నిరంతరం నీరు వస్తుందని చెప్పారు. కొన్ని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలల్లో పిట్‌లను ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే ఇంకుడు గుంతను ఏర్పాటు చేశారు.

ఉద్యమంలా ఇంకుడు గుంతలను తవ్వాలి

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఇంకుడు గుంతలు తవ్వేందుకు ఇదే సరైన సమయం. ప్రతి ఒక్కరూ తమ కాలనీలు, బస్తీల్లో ఇంకుడు గుంతలను తవ్వాలి. సొంత ఇళ్లు ఉన్న వారు డాబా మీద పడ్డ వర్షపు నీరు వెళ్లేందుకు ఇంకుగు గుంత ఏర్పాటు చేసుకోవాలి. దీంతో భూగర్భ నీటి మట్టం పెరుగుతుంది. దీన్ని ఓ ఉద్యమంలా చేపట్టాలి. ఇందుకు జలమండలి అధికారులు తగిన విధంగా సహకరించాలి. తమ కాలనీలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేస్తున్నాం.

- రాజశేఖర్, బంజారాహిల్స్

మా బోరుబావి ఎండిపోలేదు

మా బస్తీలో అందరం వలస కూలీలమే. మంచినీరు, ఇతర అవసరాల కోసం జలమండలి సరఫరా చేసే నీటిపై ఆధారపడ్డాం.. కాని వేసవిలో సరఫరా తక్కువగా ఉండడంతో గతంలో ప్రజా ప్రతినిధులు బోరింగ్ వేశారు. అది ఎండిపోయింది. మూడు సంవత్సరాల క్రితం బోరింగ్ వద్ద ఇంకుడు గుంతను తవ్వాం. వర్షం నీరు ఇందులోకి వెళ్లేలా చేశాం. రెండేళ్ల నుంచి వేసవిలో కూడా బోర్ నుంచి నీరు వస్తుంది. దీంతో మా అవసరాలు తీరుతున్నాయి.

- సుధాకర్, అంబేడ్కర్‌నగర్ వాసి

ప్రజల్లో మరింత అవగాహన రావాలి

ఇంకుడు గుంతల ఏర్పాటు విషయంలో ప్రజల్లో మరింత అవగాహన రావాలి. ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కొత్తగా చేపట్టే భారీ నిర్మాణాల దారులను తప్పనిసరిగా ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నాం. ఇందుకోసం కొన్ని నిబంధనలను కూడా జారీ చేస్తున్నాం. ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో కూడా గుంతలను నిర్మించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పనిచేస్తున్నాం.

- హరిశంకర్, జనరల్ మేనేజర్ జలమండలి



ప్రభుత్వ సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డిని కలిసి వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తున్న కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ ప్రధాన కార్యదర్శి పీవీ రవిశేఖర్‌రెడ్డి

- బంజారాహిల్స్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి)

గ్రేటర్‌లో సత్తా చాటుతాం

బోరబండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రానున్న గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతామని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. బుధవారం జరిగిన కాంగ్రెస్ హైదరాబాద్ జిల్లా కమిటీ సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రేటర్‌లో గెలుపు కోసం జరుగుతున్న కార్యచరణకు ఫసియుద్దీన్ పలు సూచనలు చేశారు.

23 నుంచి 29 వరకు మట్టి కుప్పల తొలగింపు

జీడిమెట్ల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో ఈనెల 23 నుంచి 29 వరకు మట్టికుప్పలు, భవనాల కూల్చివేతల వ్యర్థాలను తొలగించేందుకు అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల డీసీలు నర్సింహ, మల్లారెడ్డి వివిధ శాఖల అధికారులతో కలిసి బుధవారం సర్కిల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ రెండు సర్కిళ్ల పరిధిలో చేపట్టబోయే పనుల

మహిళా సాధికారికతతోనే అభివృద్ధి



జెక్ కాలనీ ఉత్సవ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్

సనత్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారికతతోనే సమాజ వికాసం జరుగుతుందని, అందుకు తనవంతు సహకారం ఉంటుందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. జెక్ కాలనీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విజయవంతంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించిన ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. జెక్ కాలనీ మహిళలు నిర్వహించే కార్యక్రమాలు స్ఫూర్తి దాయకంగా ఉన్నాయన్నారు. జెక్ కాలనీ మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలకు తన మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బతుకమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చింతిరెడ్డి ప్రభ, అన్నపూర్ణ, ప్రతినిధులు లంకా హైమవతి, పూర్నాని భాగ్యలత, అమరావతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవాలు ఘనంగా జరిగేలా సహకారమందించిన కాలనీ ఫెడరేషన్ అధ్యక్షులు మల్లు ప్రసాద్, రాజశేఖర్, చందు, శివారెడ్డితోపాటు మహిళా సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ఖైరతాబాద్ డబుల్ బెడ్‌రూం ఇళ్లలో సర్వే



ఖైరతాబాద్ డబుల్ బెడ్‌రూం సంక్షేమ సంఘం కార్యవర్గంతో సమావేశమైన అధికారులు

ఖైరతాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మీకు ఇళ్లు ఎలా వచ్చాయి..? ఎవరికైనా డబ్బులు ఇచ్చారా..? డబుల్ ఇళ్లల్లో ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అంటూ.. కేంద్ర బృందాలు ఖైరతాబాద్ డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో సర్వే నిర్వహించారు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల ఆధార్‌కార్డులు, వారికి మంజూరైన పట్టాలను చూపించమని, ఆ ఇళ్లల్లో లబ్ధిదారులున్నారా..? అద్దెకిచ్చారా అనే విషయమై సర్వే చేశారు. మొదట అధికారులు డబుల్ బెడ్ రూం సంక్షేమ సంఘం కమిటీ సభ్యులతో సమావేశమై ఇక్కడున్న సమస్యలపై ఆరా తీశారు. ఈ సమస్యలపై ఓ వినతి పత్రం సమర్పించాలని, వాటిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లామని అధికారులు తెలిపారు. డబుల్ ఇళ్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు డీబీ అనిల్‌తో పాటు సభ్యులు అధికారులకు సహకరించారు.

బీజేపీ నాయకుల అలయ్ బలయ్



అలయ్ బలయ్ కార్యక్రమంలో నాయకులు

ఖైరతాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సెంట్రల్ జిల్లా ఎస్సీమోర్చా కార్యదర్శి మానేకార్ చంద్రు బాబా ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులతో పాటు మహిళా నాయకురాళ్లు పాల్గొని దసరా శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. నేతలు ప్రేంరా జ్, రామ్మోహన్‌రావు, నగేష్, మల్లేష్‌యాదవ్, వైద్యనాథ్, కిషన్, వేణుగోపాల్‌చారి, మహేష్‌యాదవ్, వీణా మాధురి, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



జీహెచ్‌ఎంసీ కార్మికులకు వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేసిన మోడల్ కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు జేఎస్‌టీ సాయి, చంద్రశేఖర్, రాజేశ్వరి

- సనత్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి)

రహదారులపై నీరు నిలువకుండా చర్యలు



ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను సన్మానిస్తున్న శ్రీనివాసనగర్ వెస్ట్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

వెంగళరావునగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో రహదారులపై నీరు నిలవకుండా చర్యల తీసుకుంటామని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపినాథ్ అన్నారు. బుధవారం శ్రీనివాస నగర్ వెస్ట్ కాలనీ నుంచి మైత్రివనం వరకు రూ. 45లక్షలతో వేయనున్న వర్షం నీరు, సీవరేజ్ నీటి కాలువ పునర్నిర్మాణం, నూతన పైప్‌లైన్ టన్నెలింగ్ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, రవీంద్ర, కవిత, జహీర్, భార్గవి, సిర్ల, జీహెచ్‌ఎంసీ డీఈ కృష్ణ చైతన్య, ఏఈ భారత్ పాల్గొన్నారు.

రాజ్యాధికారం సాధించేదాకా విశ్రమించం



సదస్సులో మాట్లాడుతున్న బీసీ కులాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు నరహరి

ఖైరతాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీలకు ఇప్పటివరకు జరిగిన అన్యాయం, అవమానాలు ఇక భరించలేమని, రాష్ట్ర వ్యాప్తంగా బీసీలను, యువతను చైతన్యపరచి రాజ్యాధికారం సాధించేవరకు విశ్రమించేదిలేదని బీసీ కులాల ఐక్యవేదిక స్పష్టం చేసింది. బుధవారం సెంట్రల్ కోర్టు హోటల్‌లో జాతీయ బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బీసీలకు రాజ్యాధికారం అనే అంశంపై బీసీ కుల సంఘాల అధ్యక్షులు, మేధావులతో సదస్సు నిర్వహించారు. దీనికి అతిథిగా హాజరైన వేదిక జాతీయ గౌరవ అధ్యక్షుడు నరహరి, రాష్ట్ర అధ్యక్షుడు పాండుయాదవ్ మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు నాయకులయ్యేందుకు వారిలో చైతన్యం నింపేందుకు రాష్ట్ర వ్యాప్త పర్యటనలు చేయనున్నట్టు తెలిపారు. ఎంపిటీసీ, జడ్‌పీటీసీ, సర్పంచులుగా బీసీలను ఎక్కువ మందిని గెలిపించుకొని రాబోయే ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలకు సవాలు విసిరాలనే ఉద్దేశంతో ముందుకెళ్తున్నామన్నారు. సదస్సులో విశిష్ఠ అతిథిగా డాక్టర్ వినయ్‌కుమార్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్ర సత్యనారాయణ, పలు కుల సంఘాల అధ్యక్షులు సి.అశోక్‌కుమార్, శంకరయ్య, జగన్‌మోహన్, నిమ్మల వీరన్న, శ్రీనివాస్ యాదవ్, గోపిబాయి, సంధ్యారాణి, చెన్నయ్య, విజయ్ అరుణ్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కేసు

- నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రష్మీ పెరుమాళ్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో హోటళ్లు, లాడ్జీలల్లో జరిగే సమావేశాలు, సదస్సులకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ అన్నారు. నార్త్‌జోన్ పరిధిలోని హోటళ్లు, లాడ్జిల నిర్వాహకులతో బుధవారం డీసీపీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ.. హోటళ్లు, లాడ్జీలల్లో వ్యభిచారం, డ్రగ్స్ వినియోగం, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూసుకోవడం నిర్వాహకుల బాధ్యతనే అన్నారు. ఆయా హోటళ్లలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగితే హోటళ్లను సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎలాంటి పోలీస్ అనుమతులు లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మెట్రోపోలీస్ లాడ్జ్ నిర్వాహకులపై కేసులు నమోదు చేశామని, సదరు లాడ్జ్‌ను కూడా సీజ్ చేశామని తెలిపారు. ఈ సదస్సులకు హాజరైన వ్యక్తి ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహం ధ్వసం చేసిన సంఘటనను దృష్టిలో పెట్టుకొని సమావేశం నిర్వహించినట్లు డీసీపీ తెలిపారు. ఈ సమావేశానికి నార్త్‌జోన్ పరిధిలోని 200 మంది హోటళ్లు, లాడ్జీల నిర్వాహకులు పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్యపై దృష్టి సారించాలి



ఏఎంఓహెచ్‌తో సమావేశమైన కార్పొరేటర్ కవితారెడ్డి

బంజారాహిల్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై చెత్త పేరుకుపోవడంతో పారిశు ధ్య సమస్య తీవ్రమవుతోందని వెంకటేశ్వర నగర్‌కాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. బుధవారం ఆమె జీహెచ్‌ఎంసీ ఏఎంఓహెచ్ భార్గవ్ నారాయణతో సమావేశమయ్యారు. వెంటనే ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఆమె కోరారు. రోడ్ల మీద రోజూ స్వీపింగ్ చేయడం లేదని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. బస్తీల్లో చెత్త పేరుకుపోయి స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉమ్మడి బస్తీల అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న జ్ఞానేశ్వర్

బోరబండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శివమ్మ పాపిరెడ్డి(ఎస్‌పీఆర్) హిల్స్‌లోని 25 ఉమ్మడి బస్తీల అభివృద్ధికి కృషి చేస్తామని అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ అన్నారు. బుధవారం ఎస్‌పీఆర్ హిల్స్‌లో శివమ్మ పాపి రెడ్డిహిల్స్ 25 ఉమ్మడి బస్తీల డెవలప్‌మెంట్ ఫెడరేషన్ సొసైటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన సభ్యులు నూతన కమిటీ అధ్యక్షులుగా జ్ఞానేశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విస్తృత స్థాయి ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో కమిటీని ఎన్నుకుంటామని జ్ఞానేశ్వర్ తెలిపారు. సమావేశంలో ఆయా బస్తీల నాయకులు పాల్గొన్నారు.

కార్మిక శాఖకు మంత్రిని నియమించాలి

పంజాగుట్ట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు దాటినా ఇప్పటివరకు కార్మిక శాఖకు మంత్రి లేరని సీఐటీయూ జూబ్లీహిల్స్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు సీహెచ్ చంద్రశేఖరరావు అన్నారు. కార్మిక శాఖకు మంత్రిని నియమించి, కార్మిక సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీఐటీయూ హైదరాబాద్ జిల్లా నాయకుడు ఏటీవీ చలం 8వ వర్ధంతి సందర్భంగా బుధవారం యూసఫ్‌గూడ లేబర్ అడ్డా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులతో కలిసి చలం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గడిచిన రెండు నెలలుగా కార్మిక శాఖ కార్యాలయంలో కార్మికశాఖ సర్వర్, కంప్యూటర్లు పని చేయడం లేదన్నారు. దీంతో కార్మికులు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే సీఎం క్యాంప్ ఆఫీస్ వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్.అశోక్, వై. యాదగిరి, పి. వెంకటరమణ, కృష్ణ, పుల్లయ్య, ప్రసాద్, తిరుపాలు, శ్రీనివాసు, దుర్గేష్, పాపారావు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వినతి



ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతిని మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించిన సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌యాదవ్

-బంజారాహిల్స్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి)

ఫుట్‌పాత్‌లపై ట్రాఫిక్ పోలీసుల నజర్

- అమీర్‌పేట నుంచి పంజాగుట్ట వరకు స్పెషల్ డ్రైవ్
- 400 దుకాణాల తొలగింపు.. 200 మందిపై కేసులు
- ధర్నాకు దిగిన వ్యాపారులు.. నచ్చజెప్పిన పోలీసులు

బంజారాహిల్స్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట నుంచి పంజాగుట్ట రోడ్డుకిరువైపులా ఫుట్‌పాత్ వ్యాపారులు, అక్రమ పార్కింగ్‌లతో నిండిపోవడంతో తరచూ ట్రాఫిక్‌కు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. దీంతో ట్రాఫిక్ పోలీసులు ఈ దారిపై దృష్టి సారించారు. నగర అడిషనల్ కమిషనర్ (ట్రాఫిక్) విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ముఖ్యంగా అమీర్‌పేట నుంచి కనకదుర్గ దేవాలయం, డీకే రోడ్డు వరకు, అమీర్‌పేట చౌరస్తా నుంచి పంజాగుట్ట వరకు ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారాలను తొలగించారు. సుమారు 400 దుకాణాలను తొలగించి 200 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో ఫుట్‌పాత్ వ్యాపారులు తాము ఉపాధి కోల్పోతున్నామని రోడ్డు పై బైఠాయించి పోలీసు వాహనాలకు అడ్డుపడ్డారు. ఈ క్రమంలో ట్రాఫిక్ పోలీసులు వారికి సర్ది చెప్పి రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారం ఎలా చేస్తారంటూ ప్రశ్నించారు. కనీసం పాదచారులు నడవలేకుండా చేయడం చట్టం ప్రకారం తప్పే కదా అంటూ సముదాయించారు. దీంతో వ్యాపారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొన్ని కమర్షియల్ షాపుల నిర్వాహకులు ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారం చేస్తున్నట్టు గుర్తించారు. అంతే కాకుండా పార్కింగ్ స్థలాన్ని అద్దెకిస్తున్నట్టు తేలింది. వీరందరికి హెచ్చరికలు జారీ చేశారు. ఈ డ్రైవ్‌లో డీసీపీ రాహుల్ హెగ్డే, పంజాగుట్ట ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్, వివిధ ఠాణాల ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



అమీర్‌పేట రోడ్లను పరిశీలిస్తున్న నగర అడిషనల్ కమిషనర్ (ట్రాఫిక్) విశ్వప్రసాద్, డీసీపీ రాహుల్ హెగ్డే, ఏసీపీ హరిప్రసాద్

ట్రాఫిక్ సజావుగా సాగేందుకే: విశ్వప్రసాద్

ట్రాఫిక్ సజావుగా వెళ్లేలా చేసేందుకే ఫుట్‌పాత్ వ్యాపారాల తొలగింపును చేపట్టాం. చాలా కాలంగా వారిని హెచ్చరిస్తూ వస్తున్నాం. ఎవరూ వినిపించుకోకపోవడంతో తొలగింపును చేపట్టాం. ఇక మీదట ఈ దారిపై పోలీసుల నిరంతర నిఘా ఉంటుంది. ఫుట్‌పాత్ వ్యాపారాల కడుపు కొట్టే ఉద్దేశం లేదు. ఈ ఫుట్‌పాత్ వ్యాపారాల ప్రభావం సంజీవరెడ్డినగర్, బల్కంపేట, మూసాపేట, బాలానగర్ వరకు ప్రభావం చూపిస్తోంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పంజాగుట్ట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధ వారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పంజాగుట్ట కాలనీలోని అగర్వాల్ కంటి ఆస్పత్రి పక్కనే ఉన్న రహదారిలో గుర్తుతెలియని వ్యక్తి(40 నుంచి 50 సంవత్సరాలు) పడిపోయి ఉన్నాడని వచ్చిన సమాచారం మేరకు సిబ్బంది అక్కడికి వెళ్లి పరిశీలించగా అప్పటికే అతను మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

బోరబండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వ్యక్తి బుధవారం అదృశ్యమయ్యాడు. బోరబండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్‌కు చెందిన ఏ.మల్లేష్(45) 20 సంవత్సరాలుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. మల్లేష్‌కు వైద్య పరీక్షల నిమిత్తం అతని సోదరుడు సైదయ్య ఎర్రగడ్డ మానసిక వైద్యశాలకు తీసుకొచ్చాడు. వైద్య పరీక్షల అనంతరం వరండాలో ఉన్న మల్లేష్ కనిపించకపోవడంతో ఇంటికి ఫోన్ చేసి ఆరా తీశాడు. బంధువులకు ఫోన్ చేసినా రాలేదని చెప్పడంతో సైదయ్య బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళా సాధికారతతోనే సమాజ వికాసం : తలసాని


జెక్‌కాలనీ ఉత్సవ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతతోనే సమాజ వికాసం జరుగుతుందని, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అందుకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. జెక్ కాలనీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విజయవంతంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించిన ఉత్సవ కమిటీ ప్రతినిధులు బుధవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. అనంతరం తలసాని మాట్లాడుతూ జెక్‌కాలనీ మహిళలు నిర్వహించే కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని అన్నారు. జెక్ కాలనీ మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలకు తన మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఉత్సవాలు ఘనంగా జరిగేలా సహకారమందించిన కాలనీ ఫెడరేషన్ అధ్యక్షులు మల్లుప్రసాద్, రాజశేఖర్, చందు, శివారెడ్డి తోపాటు మహిళా సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ను కలిసిన వారిలో బతుకమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చింతిరెడ్డి ప్రభ, అన్నపూర్ణ, ప్రతినిధులు లంకా హైమవతి, పూర్ణాని భాగ్యలత, అమరావతి తదితరులు ఉన్నారు.

శామీర్‌పేటలోని అలంకృత రిసార్ట్స్‌లో

18 నుంచి 'సౌత్‌జోన్ ఈఎన్‌టీ సర్జన్స్ కాన్ఫరెన్స్'



మాట్లాడుతున్న డాక్టర్లు దీన్‌దయాల్, ద్వారకానాథ్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి తదితరులు

మారేడుపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) అధునాతన పద్ధతులు, పురోగతిపై ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మూడు రోజుల పాటు శామీర్‌పేటలోని అలంకృత రిసార్ట్స్‌లో 'సౌత్‌జోన్ ఈఎన్‌టీ సర్జర్స్ కాన్ఫరెన్స్-2024' నిర్వహించనున్నారు. బుధవారం ఈస్ట్ మారేడ్‌పల్లిలోని శెనాయ్ నర్సింగ్ హోమ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ఆఫ్ ఓటో లరింగా లజిస్ట్ ఆఫ్ ఇండియా టీజీ సౌత్ కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ డీఎస్ దీనదయాల్ తదితరులు వివరాలను వెల్లడించారు. కాన్ఫరెన్స్‌లక్ష చెవి, ముక్కు, గొంతు, కళ్ల డాక్టర్లతో పాటు దేశ విదేశాలలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొంటారని తెలిపారు. వైద్యావిధానంలో వస్తున్న మార్పులు వాటికి సంబంధించిన అధునాతన పరికరాల వినియోగము తదితర అంశాలపై చర్చిస్తామని తెలిపారు. ఈ వేదిక ప్రతి ఏడాది ఒక్కో రాష్ట్రంలో నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈసారి తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ నగరం వేదిక కావడం సంతోషకరమని వారన్నారు. ఈ సమీక్ష వల్ల చెవి, ముక్కు, గొంతు, కళ్ల తదితరవిషయాలపై కూలంకషంగా చర్చించి ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న ఆధునిక వైద్య విధానాలపై అవగాహన కలిగే వీలుందని అన్నారు. ఇది జూనియర్ డాక్టర్లకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వెల్లడించారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్నాటక తదితర దక్షిణాది రాష్ట్రాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులు కాన్ఫరెన్స్‌కు హాజరవుతారని తెలిపారు.

ఎన్నాళ్లీ బాధలు

- ఏడాది కాలంగా మురుగుతో సహవాసం
- ఎమ్మెల్యే రాడు... కార్పొరేటర్ పట్టించుకోడు
- లోహియానగర్‌లో ఇళ్ల మధ్య మురుగు పరుగు
- వృద్ధి చెందుతున్న దోమలు... జ్వరాల బారిన ప్రజలు


పొడైపోయిన మ్యాన్‌హోల్..
పొంగిపొర్లుతూ రోడ్డుపై పారుతున్న మురుగు


రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీరు


లోహియానగర్ బస్తీలోకి చేరిన డ్రైనేజీ మురుగు

అడ్డగుట్ట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): 'ఎనాళ్లు మాకు ఈ బాధలు. ఇళ్లల్లో ఉండలేక పోతున్నాం. అనారోగ్యాలతో ఆస్పత్రుల పాలవుతున్నాం. మా ఘోష అధికారులకు, ప్రజాప్రతినిధులకు పట్టదా, ఏడాది కాలంగా మురుగుతో సవాసం చేస్తున్నాం' అని స్థానికులు వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్‌లోని ఆర్‌ఆర్‌సీ మైదానం(లోహియ నగర్) బస్తీకి ఆనుకుని ఉన్న ఇళ్లల్లో వేల కుటుంబాలు నివసిస్తున్నాయి. ఆర్‌ఆర్‌సీ మైదానం వద్ద ప్రధాన రోడ్డుపై మ్యాన్‌హోల్ పగిలి ఏడాది కావస్తుంది. దాంతో మ్యాన్‌హోల్ నుంచి వెలువడుతున్న మురుగునీరు లోహియనగర్ మీదుగా సమీపంలోని ఇళ్లలో రోడ్లపై ప్రవహిస్తుంది. పొంగి పొర్లుతున్న డ్రైనేజీ మురుగునీరు రోజూ తెల్లవారు జాము నుంచి ఉదయం 11 గంటల వరకు, సాయంత్ర 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు రోడ్డుపై పారుతూ దుర్వాసన వెలువడుతుంది. దోమలు వృద్ధి చెంది చిన్నపిల్లలు విషజ్వరాల బారినపడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవ్వరూ పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. మురుగు సమస్యను పరిష్కరించాలని సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి స్వయంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని... ఏడాది కాలంగా డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మికి స్వయంగా, ఫోన్ ద్వారా పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. రాత్రి అయితే దోమల భయంతో వణికి పోతున్నాం. చిన్నపిల్లలు విషజ్వరాలతో బాధపడుతున్నారు. రోజూ ఇద్దరు ముగ్గురు చిన్నారులు ఆస్పత్రుల బాటపడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణీలో కూడా ఫిర్యాదు చేశాం. 'మేం ఏం పాపం చేశాం. మా సమస్యను పరిష్కరించకపోతే కార్పొరేటర్‌ను అడ్డగుట్టలో తిరుగనివ్వబోమని' వారు హెచ్చరిస్తున్నారు. లోహియనగర్ బస్తీలో తక్కువ సామర్థ్యంతో డ్రైనేజీ పైపులైన్ గతంలో వేశారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా నూతన పైపులైన్ వేయాలని స్థానికులు కోరుతున్నారు.

జ్వరాలతో చస్తున్నాం



ఆర్‌ఆర్‌సీ మైదానం వద్ద డ్రైనేజీ పైప్‌లైన్ సామర్థ్యం తక్కువగా ఉంది. అడ్డగుట్ట నుంచి లోహియనగర్ వైపు వచ్చే డ్రైనేజీ పైప్‌లైన్‌లో మ్యాన్‌హోల్ నిండి పొంగిపొర్లుతుంది. గతంలో అడ్డగుట్టకు ఎమ్మెల్యే పద్మారావు రాగా, ఆయనకు సమస్యను చూపించాం. అయినా ఇంతవరకు పట్టించుకోలేదు. దుర్వాసన కారణంగా దోమలు వృద్ధి ఇళ్లల్లో ఉండలేక పోతున్నాం. జ్వరాలతో ఆస్పత్రుల పాలవుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు గంట పాటు డ్రైనేజీ మ్యాన్‌హోల్ వద్ద ఉంటే మా బాధ వారికి తెలుస్తుంది.

-కృష్ణ, లోహియానగర్

ఏడాది కాలంగా సమస్య



ఆర్‌ఆర్‌సీ మైదానం వద్ద డ్రైనేజీ పొంగిపొర్లి ఏడాది కాలంగా రోడ్డుపై ప్రవహిస్తుంది. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఫిర్యాదు చేశాం. అయినా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు మురుగు సమస్యను పరిష్కరించాలి

- సంతోష్ చారీ - లోహియనగర్

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మృతిచెందారు. వివరాల్లోకి వెళితే... గుండ్లపోచంపల్లి- బొల్లారం రైల్వే స్టేషన్ మార్గంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడని సికింద్రాబాద్ పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెంది ఉండొచ్చని సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజు తెలిపారు.

అల్వాల్ సమీపంలో..

అల్వాల్ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు పక్కన ఓ మృతిచెందాడని పోలీసులకు సమాచారం అందింది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతిచెంది ఉండొచ్చని భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫుట్‌పాత్‌పై వ్యక్తి మృతదేహం



రెజిమెంటల్‌బజార్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి మృతిచెందాడు. సికింద్రాబాద్ క్లాక్‌టవర్ సమీపంలోని ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నాడని స్థానికులు మార్కెట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వగా, ఘటనాస్థలం వద్దకు వచ్చి పరిశీలించి మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడు ఘట్‌కేసర్‌కు చెందిన ఎస్‌కే నజీర్‌గా గుర్తించారు. ఆచూకీ తెలిసిన వారు మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ చెప్పారు.

అడ్డగుట్టలో వృద్ధురాలి అదృశ్యం


లక్ష్మమ్మ

అడ్డగుట్ట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కుమారుడు తిరిగి ఇంటికి వచ్చే సరికి తల్లి కనిపించకుండా పోయింది. ఈ ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కర్నాటక రాష్ట్రం పోతిగంటి గ్రామానికి చెందిన లక్ష్మమ్మ(80)కు ఇద్దరు కుమారులున్నారు. పెద్దకుమారుడు ఏసురత్నం సికింద్రాబాద్‌లోని మహేంద్రాహిల్స్‌లోఉంటుండగా, రెండో కుమారుడు వెంకట్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 4న తల్లి లక్ష్మమ్మ కర్నాటక నుంచి వచ్చి మహేంద్రాహిల్స్ ఉంటున్న పెద్ద కుమారుడు ఏసురత్నం వద్దకు వచ్చింది. రెండో కుమారుడు ఇంటికి తీసుకెళ్లాలని ఏసురత్నంను అడిగింది. తల్లిని బైక్‌పై ఎక్కించుకుని వెంకట్‌నగర్‌కు వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉండడంతో రెండో కుమారుడు వచ్చే వరకు ఇక్కడే ఉంటానని పెద్దకుమారుడికి చెప్పడంతో అతడు వెళ్లిపోయాడు. ఏసురత్నం సోదరుడుకి ఫోన్ చేసి అమ్మ ఇంటి వద్ద ఉన్నదని చెప్పాడు. కొద్దిసేపటికి ఇంటికి వచ్చిన రెండో కుమారుడికి తల్లి కనిపించలేదు. ఆందోళన చెందిన అతడు తన సోదరుడు ఏసురత్నంకు విషయం చెప్పాడు. అప్పటి నుంచి నగరంలోని పలు ప్రాంతాల్లో తల్లి కోసం వెతికారు. కర్నాటకలోని బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దాంతో కుమారులు బుధవారం తుకారాంగేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నల్లగుట్ట వాసులు

రాంగోపాల్‌పేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను అరెస్ట్ చేసి శిక్షించాలని పలువురు డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు విగ్రహాన్ని ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని కనకదుర్గాదేవీ ఆలయం వద్ద బుధవారం రాత్రి నల్లగుట్ట వాసులు ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు.

ప్రజా క్షేమం పట్టించుకోని ప్రభుత్వం: ఎంపీ ఈటల రాజేందర్

రెజిమెంటల్ బజార్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి ఓట్లు, సీట్లు కావాలే తప్ప ప్రజాక్షేమం పట్టించుకోవడం లేదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయాన్ని బుధవారం రాత్రి ఈటల సందర్శించారు. ఆలయంలో విగ్రహం ధ్వంసం చేసిన తీరును స్థానికనేతలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘటన జరిగి రెండు రోజులవుతున్నా ఒక్క మంత్రి కూడా సంఘటన స్థలానికి రాలేదన్నారు. దీని వెనుక ఎవరు ఉన్నారో, ఎందుకు జరుగుతున్నాయో తెలుసుకొని ప్రభుత్వం వారిపై ఉక్కు పాదం పెట్టాలన్నారు. దేశంలో ప్రశాంతత, అందరి విశ్వాసాలు కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే కేంద్ర ఏజెన్సీలను రంగంలోకి దింపుతామని ఈటల అన్నారు.

హోటళ్లు, లాడ్జీలలో సమావేశాలకు అనుమతి తీసుకోవాలి

అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులదే


మాట్లాడుతున్న డీసీపీ రష్మీ పెరుమాళ్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో హోటళ్లు, లాడ్జ్‌లలో జరిగే సమావేశాలు, సదస్సులకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ నిర్వాహకులకు సూచించారు. నార్త్‌జోన్ పరిధిలోని హోటళ్లు, లాడ్జిల నిర్వాహకులతో డీసీపీ బుధవారం సమావేశం నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ హోటళ్లు, లాడ్జీల్లో వ్యభిచారం, డ్రగ్స్ వినియోగం, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులదే అన్నారు. ఆయా హోటళ్లు, లాడ్జీలల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే సీజ్ చేసి, నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని డీసీపీ హెచ్చరించారు. ఇటీవల నగరంలోని ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహ ధ్వంసం చేసిన ఘటనను దృష్టిలో పెట్టుకొని సమావేశం నిర్వహించినట్లు డీసీపీ తెలిపారు. సమావేశంలో నార్త్‌జోన్ పరిధిలోని 200 మంది హోటళ్ల, లాడ్జీల నిర్వాహకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు చెత్త సేకరణ రిక్షాల పంపిణీ


పారిశుధ్య కార్మికులకు చెత్తసేకరణ రిక్షాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికులు కీలమని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ అన్నారు. బుధవారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెత్త సేకరణ రిక్షాలను పారిశుధ్య కార్మికులకు పంపిణీ చేశారు. ఒక్కో రిక్షా రూ. 20 ఉంటుందని, దాదాపు పది రిక్షాలను అందజేశామని కార్పొరేటర్ తెలిపారు. పారిశుధ్య కార్మికులు క్రమం తప్పకుండా ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈఈ వెంకటేశ్, బీఆర్‌ఎస్ నాయకులు అశోక్, బాలాజీ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీతాఫల్‌మండిలో స్ట్రామ్ వాటర్ లైన్, సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ కౌశిక్, బీఆర్‌ఎస్ నాయకులు కరాటేరాజు, రవి, సతీష్‌రెడ్డి, బాలాజీ, కాంగ్రెస్ నాయకులు జలంధర్‌రెడ్డి, చందర్ పాల్గొన్నారు.



జీహెచ్‌ఎంసీ కార్మికులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేసిన మోడల్ కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు జేఎస్‌టీ సాయి, చంద్రశేఖర్, రాజేశ్వరి తదితరులు
- సనత్‌నగర్ (ఆంధ్రజ్యోతి)

వర్షపు నీటిని తొలగించారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సికింద్రాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారుల్లో నిలిచిన వర్షపునీటిని తొలగించే పనులకు జీహెచ్‌ఎంసీ యంత్రాంగం శ్రీకారం చుట్టింది. 'జెడ్సీ ఆదేశాలు బేఖాతర్!, ప్రధాన ప్రాంతాల్లో వర్షపునీటి తొలగింపులో బేగంపేట సర్కిల్ యంత్రాంగం నిర్లక్ష్యం.. రోజుల తరబడి వర్షపునీరు నిల్వ, దుర్గంధంగా మారుతున్న రోడ్లు' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ విషయమై సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ అధికారులతో ప్రత్యేకంగా చర్చించినట్టు తెలిసింది. బుధవారం సికింద్రాబాద్ స్విమ్మింగ్‌పూల్, పరేడ్ గ్రౌండ్ ఎదురుగా పెట్రోల్ బంకు వద్ద, బీఎస్ఎన్‌ఎల్ ఆఫీస్తు, ప్యారడైజ్ ఫైర్‌స్టేషన్, సప్తుబాగ్ అపార్ట్‌మెంట్ తదతర పాంతాలకు పారిశుధ్య సిబ్బంది వెళ్లి రోడ్లపై నిలిచిన వర్షపునీటిని తొలగించారు. ఏఈ ఎం.శివప్రసాద్, డీఈ మహేష్, ఈఈ సుదర్శన్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఆయా ప్రాంతాల్లో నిలిచిన వర్షపునీటిని తొలగించే పనులు చేపట్టారు.


ప్యారడైజ్ ఫైర్ స్టేషన్ వద్ద వర్షపునీటిని తొలగిస్తున్న సిబ్బంది


సప్తుబాగ్ అపార్ట్‌మెంట్ వద్ద వర్షపునీటిని తొలగిస్తున్న సిబ్బంది


పరేడ్‌గ్రౌండ్ ఎదురుగా పెట్రోల్ పంప్ వద్ద వర్షపునీటిని తొలగిస్తున్న సిబ్బంది


స్విమ్మింగ్‌పూల్ బస్టాప్ వద్ద వర్షపునీటిని మ్యాన్‌హోల్‌లోకి పంపుతున్న సిబ్బంది